పర్యాటక పనులు పూర్తి చేయండి

● ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో పర్యాటక పనులు వేగవంతం చేయాలని పీవో కల్పనాకుమారి ఆదేశించారు. శుక్రవారం ఆడలి వ్యూపాయింట్ వద్ద చేపడుతున్న పనులను ఆమె పరిశీలించారు. వారం రోజుల్లో వాటిని పూర్తి చేయాలని, ఎక్కడా నాణ్యత లోపించకూడదని సూచించారు. వ్యూపాయింట్ వద్ద సుందరీకరణ పనులను ప్రారంభించాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ పరిశీలనలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ సింహాచలం, ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణమూర్తి, పీహెచ్‌వో గణేష్, ఏఈ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం

● జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం ● కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు తప్పని అవస్థలు



పార్వతీపురంలో పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి మంజులవీణ

పార్వతీపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి)/ బెలగాం: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 6,208 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 5,869 మంది హాజరయ్యారు. 339 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా కోర్సులకు సం బంధించి 3420 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 2,945 మంది హాజరయ్యారు. 475 మంది గైర్హాజరైనట్టు జిల్లా ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి డి.మంజుల వీణ తెలిపారు. జిల్లాలో మొత్తంగా 32 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. కాగా విద్యార్థులు ముందుగా ఆలయాలకు వెళ్లి పూజలు చేసుకుని ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అధికారులు తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. మొదటి రోజున ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాశారు. తెలుగు, సంస్కృతం, హిందీ సబ్జెక్టులకు సంబంధించి పరీక్షను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించారు. ఇదిలా ఉండగా పార్వతీపురంలో కొంతమంది విద్యార్థులు ఉరుకులు పరుగుల మీద పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో పలు పరీక్ష కేంద్రాలను ఏఎస్పీ దిలీప్‌కిరణ్ సందర్శించారు. పరీక్ష కేంద్రాల చుట్టు పక్కల ఉన్న పరిసరాలు, మౌలిక వసతులు, భద్రతా పరమైన చర్యలను పరిశీలించారు.



పార్వతీపురం ప్రభుత్వ కళాశాల వద్ద గేటు పనులు చేపడుతున్న దృశ్యం



కురుపాంలో రూం నెంబర్లు పరిశీలిస్తున్న విద్యార్థులు



జియ్యమ్మవలస: పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

ఒక వైపు పరీక్ష.. మరో వైపు నిర్మాణ పనులు

పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక వైపు విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా ..మరో వైపు అదే కాలేజీలో గేటు అమర్చేందుకు పనులు చేపట్టారు. పాత గేటు ఉన్నప్పటికీ.. నాడు-నేడు పనులకు సం బంధించి మెటీరి యల్స్ వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో పక్కనే మరొక గేటు అమర్చేందుకు పనులు చేపట్టారు. అయితే పరీక్ష సమయంలో గేటు నిర్మాణ పనులు చేపట్టడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. విద్యార్థులకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం వాపోయారు.

నది దాటడమే ఓ పరీక్ష..

కొమరాడ: ప్రమాదకరమని తెలిసినా నది దాటుతున్న ఈ విద్యార్థుల స్వగ్రామం కొమరాడ మండలం కొట్టు. ఈ గ్రామం నుంచి ఇద్దరు విద్యార్థులు కొమరాడలో జరుగుతున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు శుక్రవారం నాగావళి నదిలో దిగి ఇలా ప్రయాణించారు. ఇలా ఒక్క కొట్టు గ్రామస్థులే కాదు దాదాపు 8 గ్రామ పంచాయతీల పరిధిలోని 32 గ్రామాల ప్రజల సమస్య ఇది. కొమరాడ మండలా నికి 8 పంచాయతీలు నాగావళి నది ఆవల ఉన్నాయి. వీరు వర్షా కాలంలో పడే బాధలు వర్ణనాతీతం. సాధారణ రోజుల్లో నాగావళి నదిలో నీటి ప్రవాహం లేనప్పుడు ఎటువంటి భయం లేకుండా రాకపోకలు సాగిస్తుంటారు. కానీ చిన్నపాటి వర్షం పడిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. అత్యవసర, అనారోగ్య సమయాల్లో అయితే అతి కష్టం మీద నదిని దాటే సందర్భాలు అనేకం. ప్రస్తుతం చిన్నపాటి వర్షాలు పడుతుండడంతో నదిలో నీరు వచ్చి చేరుతుంది. దీంతో విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అతి కష్టం మీద చేరుకుంటున్నారు. పరీక్ష కంటే నది దాటడమే అసలైన పరీక్షగా మారిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ సర్కారు కాలయాపన..

పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణానికి 2006లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినా ఇప్పటికీ కొలిక్కి రాలేదు. మొండి గోడలతోనే దర్శనమిస్తుంది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో పదుల సంఖ్యలో గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. కానీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 10 కోట్లు మంజూరయ్యాయి. 80 శాతం పనులు పూర్తి చేశారు. కానీ ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. నిధులు కాస్త వెనక్కి వెళ్లిపోయాయి. వంతెన నిర్మాణంపై వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు తప్ప పనులను పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నది ఈ ప్రాంతవాసుల ఆవేదన.



నాగావళి నదిని దాటుకుంటూ పరీక్ష కేంద్రానికి వెళ్తున్న ఇంటర్ విద్యార్థులు

ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చూడాలి: కలెక్టర్

పార్వతీపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలె క్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి, ఓటరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆయన క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజె న్సీల నోడల్ అధికారుల నియామకం, జిల్లా కంట్రోల్ రూమ్‌లు, సోషల్ మీడియా సెల్‌లు, ఫిర్యాదులు, నివేదికల నిర్వహణ వ్యవస్థల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఓటరు గుర్తింపు కార్డుల ముద్రణ, పంపిణీ, ఓటర్ల నమోదు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీవోలు హేమలత, రమణ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్ తదితరులు

దివ్యాంగులకు అవగాహన

సాధారణ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ఓటు వినియోగంపై ఈవీఎంల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ ఆఫీసర్ ఏ.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటు నమోదు, ఓటు హక్కు ఎలా విని యోగించుకోవాలనే దానిపై విభిన్న ప్రతిభావంతులను చైతన్యపరుస్తున్నా మని తెలిపారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఇప్ప టికీ ఓటరుగా నమోదు చేసుకోనివారు ఫారం-6, తప్పుల సవరణకు ఫారం-8ను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారి కవిత, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాల్సిందే..

● ఎమ్మెల్సీ రఘువర్మ



పాలకొండ: గతంలో ఇచ్చిన హామీ ప్రకారం వైసీపీ ప్రభుత్వం తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై సర్కారు స్పందించాలన్నారు. వెంటనే పీఆర్‌సీని విడుదల చేయాలని, డీఏలు , పీఎఫ్ బకాయిలు ఇవ్వాలని, 117 జీవోను రద్దు చేయాలని అన్నారు. 3, 4 తరగతుల విలీనం ప్రాథమిక విద్యా వ్యవస్థకే గొడ్డలి పెట్టు అని తెలిపారు. 50 వేల పోస్టులు ఖాళీగా ఉన్నా.. ఆరు వేల పోస్టులకే డీఎస్సీ ప్రకటించడం చాలా దారుణమన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎన్నికల నిర్వహణ చేయాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తీరు మారాలని, సంస్కరణ దిశగా విద్యా వ్యవస్థను తీసుకెళ్లాలని తెలిపారు.

క్షేత్ర సహాయకుడి సస్పెన్షన్

గరుగుబిల్లి, మార్చి 1 : మండలంలో చినగుడబ ఉపాధి క్షేత్ర సహాయకుడు కె.ఈశ్వరరావును డ్వామా పీడీ కె.రామచంద్రరావు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి విధులు, బాధ్యతలపై నిర్లక్ష్యం వహించడంపై ఈ మేరకు చర్యలు చేపట్టారని ఏపీవో ఎం.గౌరీనాథ్ శుక్రవారం తెలిపారు. ఆయన పనితీరుపై గతంలో సంజాయిషీ కోరుతూ మెమో జారీ చేసినా ఎటువంటి మార్పు రాలేదన్నారు. గత నెల 20న పథక సంచాలకులు చినగుడబలో పనులు పరిశీలించిన సమయంలో పలు అవకతవకలు బయటపడ్డాయన్నారు. 'పనులు నిర్వహించే ప్రాంతంలో ముందుగా తుప్పలు తొలగించకుండా మట్టి పనులు నిర్వహించడం, ట్రెంచింగ్ నిర్వహించకపోవడం, ముందస్తుగా కొలతలు ఇవ్వకపోవడం, గ్రూపులు సరిగ్గా నిర్వహించక పోవడం.. 600 జాబ్‌కార్డులకు ఒకే గ్రూపుగా చిన్న చెరువులో పని కేటాయించడం వంటి కారణాలు బయటపడ్డాయి.' అని ఆయన తెలిపారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు వేయకపోవడం కూడా గుర్తించామన్నారు. మృతి చెందిన వారికి పనుల నిర్వహణకు డిమాండ్, పనికి రాని వారికి మస్తర్లలో హాజరు వేయడం, పూర్తిస్థాయిలో మేట్లను ఏర్పాటు చేయకపోవడం వంటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ఆయన చెప్పారు. ఇదిలాఉండగా మండలంలో కొద్దిరోజుల కిందట టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.పద్మావతిని పథక సంచాలకులు సస్పెండ్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వలంటీర్ మృతి

బొబ్బిలి, మార్చి 1: బొబ్బిలిలోని గొల్లపల్లి పదోవార్డు సచివాలయం పరిధిలోని వలంటీర్ కిలారి నాగరాజు(29) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గున్నతోటవలస సమీపంలో రైలు పట్టాల మధ్య నాగరాజు మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. ఏదైనా రైలు ఢీకొని మృతి చెందాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. కింతలవానిపేట పంచాయతీ లింగమ్మవలసకి చెందిన నాగరాజు బొబ్బిలిలోని బండారువీధిలో నివాసం ఉంటూ గొల్లపల్లిలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. అతనికి వివాహమైంది. నాగరాజు ఈ నెల ఒకటిన పెన్షన్ పంపిణీ చేసేందుకు వార్డు సచివా లయం అధికారుల నుంచి రూ.75 వేలు తీసుకుని గురువారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. శుక్రవారం పెన్షన్ సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇంతలో ఏమి జరిగిందో ఏమో కాని రైలు పట్టాలపై అచేతనంగా కనిపించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి తెలిపారు.

కొఠియాలో ఎస్పీ పర్యటన

● పోలింగ్ కేంద్రాల పరిశీలన ● సమస్యలపై ఆరా

సాలూరు/రూరల్/ మక్కువ, మార్చి 1 : కొఠియా గ్రూప్‌లో పోలింగ్‌కు ఎప్పుడు సమస్య వచ్చిందని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆరా తీశారు. శుక్రవారం కొఠియా గ్రూప్ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. నేరేళ్లవలసలో ఏపీ పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కొఠియా గ్రూప్ గ్రామాల ప్రజలు.. ఏపీ ఎన్నికల్లో ఓటు వేసే క్రమంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇరు రాష్ట్రాల ఎన్నికలకు పోలింగ్ సజావుగా జరగ్గా, ఏపీ పోలింగ్‌కు ఎప్పుడు సమస్య వచ్చిందని కొఠియా సీఐ నారాయణరావు, ఎస్‌డీఎఫ్ సీఐ రోహిణిపతిలను ప్రశ్నించారు. 2019 ఎన్నికలకు ఎటువంటి అవరోధాలు కలగలేదని వారు వివరించారు. పరిషత్, పంచాయతీ ఎన్నికల సమయంలో సమస్య ఏర్పడిందన్నారు. దానిపై ఒడిశా సుప్రీంకోర్టుకు వెళ్లడం, అక్కడి ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా తరలిరావడం తదితర విషయాలను వివరించారు. అనంతరం కొఠియా గ్రూప్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న శిఖపరువు, డొంకల వెలగవలస పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఏ గ్రామాల ప్రజలు ఓట్లు వేయనున్నారు? ఏయే మార్గాల్లో రానున్నారు? అని ఎస్పీ ప్రశ్నించారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎగువశెంబి, కొఠియా, ముడకారు, డోలియాంబ, పట్టుచెన్నారు, పగులుచెన్నారు తదితర కొఠియా గ్రూప్ గ్రామాలను ఆయన పరిశీలించారు.

● సాలూరు రూరల్, మక్కువ పోలీసు స్టేషన్‌ను కూడా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. రాత్రి వేళల్లో గస్తీని పక్కాగా నిర్వహించాలని, ఎన్నికల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉపేక్షించొద్దని సిబ్బందికి సూచించారు. సాలూరు సీఐ బాలకృష్ణ, ఎస్ఐ పి.నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.



నేరేళ్లవలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ



సదస్సులో చర్చిస్తున్న రైతు సంఘం నాయకులు

భూ హక్కుల చట్టం ప్రమాదకరం

● జిల్లా సదస్సులో రైతు సంఘం నాయకులు

పాలకొండ: వైసీపీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ హక్కుల చట్టం అత్యంత ప్రమాదకరమని రైతు సంఘం రా ష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీపీ ప్రసాద్ తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పాలకొండలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కారు తీసుకొచ్చిన భూ హక్కుల చట్టం కబ్జాదారులకు అనుకూలమైందన్నారు. దీనివల్ల సామాన్య రైతులు, ప్రజలు, స్థిరాస్తిపరులు తమ హక్కులను రుజువు చేసుకోవడానికి హైకోర్టుకు వెళ్లాల్సి ఉందని తెలిపారు. అయితే ఆర్థికస్తోమత, ఆ చైతన్యం లేనివారు ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. దీనిపై న్యాయవాదులు చేస్తున్న ఆందోళన చేస్తుండగా.. అది వారి ఒక్కరి కోసమే కాదన్నారు. రైతులను చైతన్యపర్చడంలో రైతు సంఘం నాయకులు, సభ్యులు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, జనార్దన్‌రావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు అప్పలనాయుడు, లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది మురళీమోహన్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ప్రయాణం

● తప్పనిసరి పరిస్థితుల్లో గిరిజనుల రాకపోకలు

● తరచూ దుర్ఘటనలు ● వాహనాల బోల్తా.. పలువురి మృత్యువాత

● క్షతగాత్రులుగా మరికొంతమంది..

● దృష్టిసారించని ప్రభుత్వం, ఉన్నతాధికారులు

● మండిపడుతున్న గిరిజన సంఘాలు

సాలూరు రూరల్, మార్చి1 : గిరిశిఖర ఏవోబీలో కొఠియా గ్రూప్ గిరిజనులకు ఈ ప్రమాదకర ప్రయాణం తప్పడం లేదు. వారి గ్రామాలకు రవాణా సదుపాయం లేకపోవడంతో ఇలా తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే సమయంలో ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ఘటనలో ఎంతోమంది మృత్యువాత పడుతుండగా... మరెంతోమంది క్షతగాత్రులుగా మారుతున్నారు. గతంలో పట్టుచెన్నారు వెళ్తున్న జీపు బోల్తా పడగా.. ఒకరు మృతి చెందారు. తాజాగా గతనెల 27న కొదమ నుంచి ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న జీపు కొడంగివలస వద్ద బోల్తా పడగా.. 25 మంది గాయపడిన విషయం విదితమే. తరచూ ఇటువంటి ఘటనలు సంభవిస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంపై గిరిజన సంఘాల నేతలు మండిపడుతున్నారు. సాలూరు నియోజకవర్గం విషయానికొస్తే.. మక్కువ మండలం నంద గ్రామంలో ప్రతి శనివారం సంత జరుగుతుంది. ఈ సంతకు పట్టుచెన్నారు, పగులు చెన్నారు, డోలియాంబ, ముడకారు, సొలిపిగుడ, ఎగువ మెండంగి తది తర కొఠియా గ్రూప్ గ్రామాల నుంచి గిరిజనులు తరలివస్తారు. తమ సరుకులను విక్రయించి, వారికి కావాల్సిన నిత్యావసరాలను కొనుగోలు చేసుకుని తిరుగుప్రయాణమవుతారు. అయితే కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం తారురోడ్లు వేసినప్పటికీ .. మరేతర ప్రయాణ సౌకర్యాల్లేవు. దీంతో ఆయా గ్రామస్థులు సంత రోజున కిరాయికి జీపు డ్రైవర్లతో మాట్లాడుకొని ఇలా వస్తుంటారు. వివిధ గ్రామాల్లో 17 వరకు జీపులున్నాయి. సాలూరు మండలంలో ప్రతి శని, మంగళవారాల్లో జరిగే తోణాం, నేరేళ్లవలస సంత లకు కూడా ఇదే విధంగా గిరిజనులు ప్రయాణిస్తుంటారు. శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాలకు కూడా తప్పని సరిపరిస్థితుల్లో బాడుగకు మాట్లాడుకున్న జీపులోనే రాక పోకలు సాగిస్తుంటారు. ఆయా వాహనాలకు ఫిట్‌నెస్ లేకపోవడం, సామర్థ్యానికి మించి ఎక్కువ మందిని వాటిల్లో ఎక్కించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధానంగా ఘాట్ రోడ్డులో అదుపుతప్పి ఆయా వాహనాలు బోల్తా పడుతున్నాయి.. గిరిశిఖర గ్రామ గిరిజనులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలని, గిరిజనులకు అవగాహన కల్పించి.. వారి భద్రతకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నేతలు మణికుమార్, భగవాన్, రంజిత్ కుమార్, సాయిబాబు, ఈశ్వరరావు డిమాండ్ చేస్తున్నారు.



జీపు టాప్‌పై ఇలా వెళ్తున్న కొఠియా గిరిజనులు (ఫైల్)

భవన నిర్మాణ కార్మికులపై చిన్నచూపు తగదు


సాలూరు: నిరసన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పాచిపెంట: భవన నిర్మాణ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడటం తగదని సీఐటీయూ నాయకుడు కోరాడ ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం పాచిపెంటలో భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. సంక్షేమ బోర్డులో ఉన్న రూ.రెండు వేల కోట్లను ముఖ్యమంత్రి దారి మళ్లించి వేరే అవసరాలకు వినియోగించడం తమ పట్ల చిన్న చూపు చూడటమేనని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘ మండల నాయకులు బొడ్డాన అప్పన్న, పి.సింహాచలం, తూముల తిరుపతిరావు, కోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును నాశనం చేసిన వైసీపీ

సాలూరు: సంక్షేమ బోర్డును వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందని భవన నిర్మాణ కార్మికుల సంఘ ప్రతినిధులు జగన్నాథం, చిన్నయ్య అన్నారు. పట్టణంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన సంక్షేమ సంఘం బోర్డులో వైసీపీ ప్రభుత్వం నిధులు లేకుండా చేసి కార్మికుల హక్కులను హరించిందని అన్నారు. సంక్షేమ బోర్డు ఉన్నపుడు కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ తీరు మారాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం చేపట్టబోయే అంశాలను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.వై.నాయుడు, మంగమ్మ, మల్లేష్, గోపి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సంస్థల సర్వే ప్రారంభం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: మధ్యతరహా, చిన్న, సూక్ష్మ పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) సర్వే శుక్రవారం ప్రారంభమయ్యింది. కలెక్టర్ నిశాంత్‌కుమార్ సర్వే వివరాల పోస్టర్‌ను స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్ సర్వే వివరాలు అందించారు. ఎంఎస్ఎంఈల పనితీరును మెరుగుపర్చడం, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకం కింద సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఎంఎస్ఎంఈల సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని సంస్థలను డిజిటల్ ప్లాట్ ఫాంలోకి తీసుకొచ్చి ఏపీఎంఎస్ఎంఈవన్ పోర్టల్‌కు అనుసంధానిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వేను మార్చి 20వ తేదీ వరకు చేపడతారన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సర్వే పురోగతిని పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు, పాలకొండ, పార్వతీపురం ఆర్డీవోలు కె.హేమలత, ఎ.వెంకటరమణ, పరిశ్రమలశాఖ సహాయ సంచాలకుడు పి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

పాలకొండ: జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా జాబ్‌మేళాను శుక్రవారం ప్రారంభించారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ ఉజ్వల్, కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాబ్‌మేళాలతో యువతకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 12 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 386 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. అందులో 112 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ సత్యంనాయుడు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్, సత్యసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నానో టెక్నాలజీ రైతులకు అవసరం


మాట్లాడుతున్న ఏవో తిరుపతిరావు

పాచిపెంట: రోజు రోజుకీ మారుతున్న సాగు పద్ధతులను మరింత సరళంగా మార్చుకోవడానికి నానో టెక్నాలజీ యూరియా రైతులకు అవసరమని వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. శుక్రవారం గడివలస లో నానో టెక్నాలజీపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నానో యూరియాలో నత్రజని నాలుగు శాతం, నానో డీఏపీలో నత్రజని ఎనిమిది శాతం, భాస్వరం 16 శాతం ఉంటాయన్నారు. నానో యూరియా, నానో డీఏపీ ఏవిధంగా వాడాలనే అంశాలను రైతులకు వివరించారు. ఈ అవగాహన సదస్సు లో గ్రామ వ్యవసాయ సహాయకురాలు అశ్విని లావణ్య, రైతులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక


సురేష్‌ను పార్టీలో ఆహ్వానిస్తున్న మాధవి

భోగాపురం: పూసపాటిరేగ మండలానికి చెందిన వైసీపీ యువజన నాయకుడు రౌతు సురేష్ శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. ముంజేరు గ్రామంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి లోకం మాధవి ఆధ్వర్యంలో ఆయన జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానివ్వం

గుమ్మలక్ష్మీపురం: వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ఎంపీపీ దీనమయ్య శుక్రవారం ప్రారంభించారు. ప్రజలకు మంచినీటిని సరఫరా చేసేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండలంలోని 27 పంచాయతీల్లో ఎక్కడైనా చేతిపంపులుగానీ, బోర్లుగానీ పాడైతే తక్షణమే సంబంధిత సచివాలయ సిబ్బందికి లేదా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ నాగేశ్వరరావు, ఎంపీడీఓ జగదీష్ కుమార్, ఏఈ ప్రవీణ్ కుమార్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన కార్మికుల దీక్షలు

సాలూరు: కార్మికుల నిరవధిక దీక్షలు ఫలించాయి. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి వారి జీతాలను పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించటంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ఎస్.వై.నాయుడు మాట్లాడుతూ కార్మికుల వేతనం రూ.21 వేలుగా ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జయింతి ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. అలాగే పత్రువాడ గ్రామానికి వెళ్లే వంతెనతో పాటు గంగచోళ్లపెంటలో రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. ● **వీరఘట్టం:** మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

పన్నులు ఒకేసారి చెల్లిస్తే వడ్డీ రాయితీ

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలంపై పన్ను ఒకేసారి చెల్లిస్తే (వన్‌టైం సెటిల్‌మెంట్) వడ్డీ రాయితీ పూర్తిగా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ పి.బాలాజీప్రసాద్ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలంపై పన్న మార్చి 31వ తేదీలోగా వన్‌టైం సెటిల్‌మెంట్‌లో చెల్లించినవారికి సదరు పన్నులో వడ్డీ రాయితీ పూర్తిగా కల్పిస్తామని, ఇప్పటికే వడ్డీ చెల్లించినవారికి ఆ సొమ్మును వచ్చే ఏడాది చెల్లించాల్సిన పన్నులో సర్దుబాటు చేస్తామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

● ప్రశాంతంగా నిర్వహణ ● పలువురు గైర్హాజరు


బెలగాం: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ దిలీప్‌కిరణ్

సీతంపేట: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయని గురుకుల కళాశాల నోడల్ ప్రిన్సిపాల్ పి.నాగభూషణరావు తెలిపారు. సీతంపేట బాలుర గురుకుల పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, మల్లి సీవోఈ కళాశాలకు చెందిన 497 మంది గిరిజన విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 490 మంది హాజరైనట్టు ఆయన తెలిపారు. ● **మక్కువ:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ములక్కాయవలస ఆదర్శ పాఠశాల, కాశీపట్నం కేజీబీవీ, రాజు జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 420 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 395 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను చీఫ్ సూపరింటెండెంట్ వాసుబాబు పర్యవేక్షించారు. ● **జియ్యమ్మవలస:** చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలకు తొలిరోజు శుక్రవారం 15 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ జి.శివప్రసాద్ తెలిపారు. మొత్తం 431 మంది హాజరుకావాల్సి ఉండగా 416 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు. ● **సాలూరు రూరల్:** బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల కేంద్రంలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 270 మంది హాజరయ్యారు. ● **సీతానగరం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలో మొదటిరోజు పరీక్ష 264 మందికి విద్యార్థులకుగాను 30 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ తెలిపారు. ● **గుమ్మలక్ష్మీపురం:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. భద్రగిరి పీటీజీ, బాలుర గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీటీజీలో 281 మంది విద్యార్థులకు తెలుగు 247, హిందీ 18 మంది పరీక్షలు రాశారు. భద్రగిరి పాఠశాలలో 369 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ● **సాలూరు:** పట్టణంలో శుక్రవారం వివిధ కళాశాలల్లో నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షకు 127 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు. ● **కురుపాం:** కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్.ఉషారాణి, డీవోలుగా డి.తవిటినాయుడు, పీసీ శర్మలు వ్యవహరించారు. ● **భామిని:** ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు శుక్రవారం 9 మంది గైర్హాజరైనట్టు ఎగ్జాం చీఫ్ ఎర్రంనాయుడు తెలిపారు. శుక్రవారం ప్రశాంతంగా మొదటి పరీక్ష ముగిసింది. తెలుగు పరీక్షకు 243 మంది, ఒడియాకు 25 మంది హాజరయ్యారు. ప్రతి రూంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


భామిని: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


మక్కువ: పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు



సాలూరు రూరల్: బొడ్డవలస కేంద్రానికి వచ్చిన విద్యార్థులు


గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి


మాట్లాడుతున్న సంధ్యారాణి

సాలూరు: ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని, పరువు నష్టం కేసు పెడతానని న్యాయవాది రేగు మహేష్‌పై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి విరుచుకుపడ్డారు. సాలూరులోని తన నివాసంలో శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కుల ధ్రువీకరణ పత్రంపై ఫిర్యాదులు చేయటం సిగ్గు చేటన్నారు. తన పుట్టకను, తన తల్లిని అవమానిస్తే వదిలే ప్రశక్తే లేదని మండిపడ్డారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు రాజన్నదొరతో పాటు వచ్చి, ఎలా నామినేషన్ వేయాలో తెలియక స్ర్కూటినీలో పోయారని.. అంత గొప్ప న్యాయవాది తమరని ఎద్దేవా చేశారు. 'నిజంగా నేను ఎస్టీ కాదు అని అనుకుంటే, అధికారంలో ఉన్న రాజన్నదొర నా కుల ధ్రువపత్రం రద్దు చేయవచ్చుకదా.. అందరినీ బెదిరించినట్టు నన్ను బెదిరిస్తే ఊరుకునేది లేదని, ఇంటికి వచ్చి మరీ ఆధారాలు చూపమంటాను లేకుంటే అక్కడే చెప్పుతో కొడతా' అని హెచ్చరించారు. రాష్ట్ర గిరిజన జేఏసీ సహకార్యదర్శి మండల గిరిధర్‌రావు, గిరిజన న్యాయ సలహాదారు కోట్ల లక్ష్మణ, టీడీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మిడి సింహాచలం తదితరులు మాట్లాడుతూ సంధ్యారాణిపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ప్రసాద్‌బాబు, వేణు, పరమేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి


వ్యాక్సిన్ల నిల్వలపై ఆరా తీస్తున్న డీఎంవో

పార్వతీపురంటౌన్: ఈనెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత వైద్యాధికారులు, సిబ్బందిపై ఉందని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్ అన్నారు. పట్టణంలోని ఆరోగ్య కేంద్రాలతో పాటు పీపీ యూనిట్లను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల సమగ్ర సమాచారాన్ని సేకరించి వారికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. వ్యాక్సినల్ నిల్వలకు సంబంధించి పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. బ్యానర్లు, పోస్టర్లను నిర్దేశించిన ప్రదేశాల్లో ఏర్పాటుచేసి పల్స్‌పోలియోపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సంచార, తాత్కాలిక జీవనం ఏర్పాటు చేసుకునే సంచార జాతుల కుటుంబాల్లోగల పిల్లలను గుర్తించి, వారికి పోలియోచుక్కలు వేయాలన్నారు. ● **గరుగుబిల్లి:** ఈనెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు విధిగా పాల్గొనాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. పల్స్‌పోలియో పూర్తయ్యే వరకు పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల సిబ్బందికి, ఆరోగ్య సిబ్బందికి సెలవులు, అనుమతి మంజూరు చేయవద్దని ఎంపీడీవో ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో ఎస్.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. ● **సీతానగరం:** స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం పల్స్ పోలియోపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. 3వ తేదీన జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ● **గుమ్మలక్ష్మీపురం:** ఈనెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని అధికారులు, వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని ఎంపీపీ దీనమయ్య, ఎంపీడీవో జగదీష్ కుమార్‌లు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఉదయం 8 నుంచి వైద్య సిబ్బందికి నిర్దేశించిన కేంద్రాల వద్దకు చేరుకుని చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో తాడికొండ పీహెచ్‌సీ వైద్యుడు ఎం.బుద్ధేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తం


పీహెచ్‌సీలో రోగులకు పరామర్శిస్తున్న ఏఎంవో సూర్యనారాయణ

కురుపాం: గిరిజన గ్రామాల్లోని మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ మలేరియా అధికారి డి.సూర్యనారాయణ కోరారు. నీలకంఠపురం పీహెచ్‌సీలో రోగులను ఆయన శుక్రవారం పరామర్శించారు. వైద్యాధికారి అభినవ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంగన్నదొరవలసను సందర్శించి ఫోకల్ స్ప్రేయింగ్ తీరును పరిశీలించారు. అందరూ తప్పనిసరిగా దోమ తెరలను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూవో మోహనరావు, సూపర్‌వైజర్ శ్రీహరి, కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న కాయకల్ప ప్రత్యేకాధికారి నాగభూషణరావు

జియ్యమ్మవలస: చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప ప్రత్యేకాధికారి, పాలకొండ సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డా.గొర్లి నాగభూషణరావు శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. స్వచ్ఛభారత్‌పై సిబ్బందితో చర్చించారు. ఆ తరువాత ఆయన డాక్టర్ సునీల్ కుమార్‌ను, హెడ్‌నర్సు పార్వతి, స్టాఫ్‌నర్సులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో ఉద్యానవనాలను పెంచాలన్నారు.

టీఎంసీ నేత షాజహాన్‌ను కాపాడడం తగదు

బెలగాం: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో లైంగిక వేధింపులు, కబ్జాలకు సంబంధించి క్రిమినల్ కేసులు ఉన్న నిందితుడు షాజహాన్‌ను సీఎం మమతా బెనర్జీ వెనకేసుకు వస్తున్నారని.. దీనిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మహిళలపై దాడులను ఖండిస్తూ పార్వతీపురం బస్టాండ్ కూడలి వద్ద బీజేపీ నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్ హుస్సేన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రయోగాత్మక విద్యతో నైపుణ్యం

● డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: ప్రయోగాత్మక విద్యతోనే నైపుణ్యం సాధ్యమని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌లో విజేతలకు ఆయన శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. సాలూరు మండలంలో రూ.1.60 కోట్లతో నిర్మించే గొందివలస రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కొత్తవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.1.75 కోట్లతో నిర్మించనున్న అదనపు వసతి, రూ.కోటితో డైనింగ్ రూం, అంటివలస పాఠశాలలో రూ.50లక్షలతో నిర్మించనున్న డైనింగ్ హాల్, తోణాం పంచాయతీ శిమిడివలసలో రూ.1.25 కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు, నార్లవలస పంచాయతీ మూలవలసకు రూ.కోటితో నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, దండి శ్రీనివాసరావు, పెద్దింటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

దోనుబాయిలో ఉచిత వైద్య శిబిరం

సీతంపేట: దోనుబాయి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 350 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేసినట్టు పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న గిరిజన రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. అనంతరం నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, ఎస్ఐ అనిల్ కుమార్, జెడ్‌పీటీసీ బిడ్డిక ఆదినారాయణ, సర్పంచ్ వెంకునాయుడు, ఎంపీటీసీ జి.కోటేశ్వరరావు, వైద్యాధికారులు భాను ప్రతాప్, రవీందర్, చిరంజీవి పాల్గొన్నారు.

గీతను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించొద్దు


మాట్లాడుతున్న మండల గిరిధర్‌రావు

సాలూరు: అరకు ఎంపీగా కొత్తపల్లి గీతను ప్రకటిస్తే ఒక్క ఓటు కూడా పడదని ఆంధ్రప్రదేశ్ గిరిజన జేఏసీ సహాయ కార్యదర్శి మండల గిరిధర్‌రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులతో కలసి స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. గతంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఎంపీగా పోటీ చేసి గెలిచిన తర్వాత అరకు నియోజకవర్గ ప్రజలకు ముఖం కూడా చూపించలేని కొత్తపల్లి గీత మళ్లీ ఏ ముఖం పెట్టుకొని పోటీకి సిద్ధమవుతున్నారని ప్రశ్నించారు. ఆమె ఎంపీగా ఉన్న కాలంలో తన పరిధిలో ఉన్న ఏడు ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో కూడా ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒడిశా

1,365 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: గంజాయ తరలిస్తున్న అంతర్రాష్ట్ర నిందితులను పద్మాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయం విడుదల చేసిన ప్రెస్‌నోట్ అంశాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం బీహార్‌కు చెందిన ఓ లారీలో కొబ్బరికాయలతో పాటు గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం రావడంతో పద్మాపూర్ పోలీసులు దాడిచేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 39 పాలిథిన్ సంచుల్లో ఉన్న 1,365 కిలోల గంజాయి, వెయ్యి కొబ్బరికాయలు, రూ.5వేలు, రెండు సెల్‌ఫోన్లు, ఆధార్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుల్లో బీహార్ రాష్ట్రం పాట్నా జిల్లా సాలింపూర్ పోలీసుస్టేషన్ పరిధి గోరేరియా గ్రామానికి చెందిన శ్రావణ్‌పాల్, అదే రాష్ట్రానికి చెందిన ఉజ్జాల్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి, చంద్రపూర్ గ్రామానికి చెందిన రాజేంద్ర రయతగా పోలీసులు గుర్తించారు. నిందితులను కోర్టుకు తరలించారు. గంజాయిని వీరు గజపతి జిల్లా నుంచి బీహార్‌కు తరలిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో కనుగొన్నారు.

సారా బట్టీలపై దాడులు

రాయగడ: అక్రమంగా సారా తయారుచేస్తున్న బట్టీలపై టికిరి పోలీసులు దాడులు జరిపారు. కాశీపూర్ సమితి టికిరి పరిధి జోడియాపొడ గ్రామ పరిసరాల్లో దాడులు జరిపి, సారా తయారు చేసేందుకు ఉపయోగిస్తున్న 800 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. దీంతో పాటు 70 లీటర్ల సారా, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు.

దివ్యాంగులపై ప్రేమ చూపాలి

రాయగడ: దివ్యాంగులపై ప్రేమ చూపాలని డీఐపీఆర్వో బసంత కుమార్ ప్రధాన్ అన్నారు. అంతర్జాతీయ వీల్‌ఛైర్ దినోత్సవం సందర్భంగా స్థానిక బిజూపట్నాయక్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత దివ్యాంగులను వీల్‌ఛైర్‌లో కూర్చోపెట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారికి కొత్త వీల్‌ఛైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి సింహాచల మహాపాత్ర, శాసన సభ్యుడు మకరంద ముదిలి, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు అమరేంద్రనాథ్ పాల్గొన్నారు.

భజరంగదళ్ సభ్యుల రక్తదానం

రాయగడ: జిల్లా భజరంగదళ్ సభ్యులు శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 40 యూనిట్ల రక్తాన్ని వైద్యులు సేకరించారు. ఈ.శక్తిధరన్, జి.లోకేశ్వరరావు, అమరేష్ పటేల్, షణ్ముఖదొర, జీసీ నాయక్, అశోక్ మహారాణా పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేడు పోలమాంబ హుండీల లెక్కింపు

మక్కువ: శ్రీశంబర పోలమాంబ అమ్మవారి హుండీల లెక్కింపును శనివారం చేపట్టనున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి చదురుగుడి, వనంగుడిల వద్ద ఏర్పాటుచేసిన హుండీలను లెక్కిస్తామని చెప్పారు. ఆసక్తిగల భక్తులు ఈ హుండీల లెక్కింపులో పాల్గొనాలని సూచించారు.

ప్రమాదాలను నివారిద్దాం

పార్వతీపురంటౌన్: ప్రమాదాల నివారణలో డ్రైవర్లు భాగస్వాములు కావాలని ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి సుధాకర్ అన్నారు. పార్వతీపురం డిపోలో ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమానికి ఆయన శుక్రవారం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం మన బాధ్యత అన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

గరుగుబిల్లి: పార్వతీపురం - శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ రహదారి జంక్షన్ నుంచి పిట్టలమెట్ట గ్రామం వరకు సుమారు రూ.1.4 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు, సర్పంచ్ కె.ఇందుమతి, మాజీ ఎంపీపీ డి.ధనుంజయరావు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94403 22964, 95025 79287, 81211 87901 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బోధనభ్యాసన అభివృద్ధి పరిశీలన

సీతానగరం: లచ్చయ్యపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఇంటర్నేషనల్ బాకలూరియట్ బృందం ఎస్ఈఆర్‌టీ ప్రొఫెసర్ కాశీరాజు శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల బోధనాభ్యాస అభివృద్ధి తరగతి స్థాయి విద్యార్థి సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి బోధన మెలకువలపై అవగాహన కల్పించారు. ఎంఈవో జి.సూరిదేముడు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

విద్యాదీవెన నిధులు విడుదల

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న 18,369మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, కాపు, క్రిస్టియన్ విద్యార్థులకు రూ.12.32 కోట్ల చెక్కును కలెక్టర్ నిశాంత్‌కుమార్ అందించారు. కృష్ణా జిల్లా పామర్రు నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి రూ.708.68 కోట్లను బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి విడుదల చేశారు. కలెక్టర్.. ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్‌తో కలిసి లబ్ధిదారులకు నమూనా చెక్కులను అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం

● ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి ● టీడీపీ-జనసేన శ్రేణులు అపోహలు వీడండి ● కూటమి గెలుపు కోసం పనిచేయండి ● టీడీపీ ముఖ్య నాయకుల పిలుపు

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ-జనసేన శ్రేణులు కలిసి పని చేయాలి. అపోహలు వీడి కూటమి గెలుపు కోసం కష్టపడండి. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం. ఆయన్ను మళ్లీ సీఎం చేసేందుకు సైనికుల్లా పని చేయాలి. ఫ్యాన్ రెక్కలు విరగ్గొట్టడానికి ప్రజలు కసితో ఉన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలి అని టీడీపీ అభ్యర్థులు పిలుపునిచ్చారు. ఈ మేరకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు.

ఎన్నికలకు సమయాత్తం కావాలి: కోండ్రు



మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రాజాం, మార్చి 1: ఎన్నికల శంఖారావానికి తెలుగుదేశం నాయకులు సమాయత్తం కావాలని మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. సీఎం జగన్‌రెడ్డి అధికార దుర్వినియోగం చేశారు తప్ప అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. తమ జీవితాలను నాశనం చేసిన ఫ్యాన్ రెక్కలను విరగొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురవాన నారాయణరావు, నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, పెంకి గౌరీశ్వరరావు, పొట్నా చిట్టిబాబు, శాసపు రమేష్‌కుమార్, వంగా వెంకటరావు, టంకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయండి: కోళ్ల లలితకుమారి



మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: టీడీపీ-జనసేన నేతలు, కార్యకర్తలు అపోహలు వీడి పార్టీకోసం కష్టపడి పనిచేయాలని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎల్.కోటలో జరిగిన నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ అధినేత ఆదేశాలమేరకు అంతా ఒక్కతాటిపై ప్రయాణం చేయాలన్నారు. పసుపు కండువా వేసుకున్న ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. టిక్కెట్ విషయంపై నేతలు, కార్యకర్తల్లో అపోహలు, సందేహాలు ఉన్నాయని తెలిపారు. అటువంటి అపోహలు పడొద్దని, అధినేత అన్ని చూసుకుంటున్నారని, మంచి జరుగుతుందని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శ కేబీపీ రాంప్రసాద్ తెలిపారు. పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కష్టపడ్డ వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ-జనసేన కలయిక రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమని కోళ్ల దంపతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తు: కొండపల్లి



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం(దత్తిరాజేరు): చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. టి.బూర్జవలసలో శుక్రవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేవి రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించబోయే ఎన్నికలని అన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని తెలిపారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో గంట్యాడ మాజీ ఎంపీపీలు కొండపల్లి కొండలరావు, బెజవాడ రాజేశ్వరి, శ్రీదేవి, బొండపల్లి మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము, పార్టీ సీనియర్ నాయకులు బి.బంగారునాయుడు, చెల్లూరి సత్యారావు, గుసిడి జగన్నాథం, మంత్రి రామారావు, తెలుగు యువత అధ్యక్షుడు బి.శంకరరావు పాల్గొన్నారు.

ప్రజల ఆదరాభిమానాలే గెలిపిస్తాయి: జగదీశ్వరి

జియ్యమ్మవలస: ప్రజల ఆదరాభిమానాలే తనను గెలిపిస్తాయని కురుపాం నియోజకవర్గ టీడీపీ, జనసేన అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం చినమేరంగిలో మాజీ మంత్రి శత్రుచర్ల స్వగృహంలో కురుపాం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వ అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తూ టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను కూడా వివరించాలని కోరారు. అంతకు ముందు ఎంపీపీ బొంగు సురేష్, అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, అక్కేన మధుసూదనరావు, నంగిరెడ్డి మధుసూదనరావు, ఎంబీ విజయవాంకుశం, శేఖర పాత్రుడు, జనసేన ఇన్‌చార్జి కడ్రక మల్లేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ జగదీశ్వరిని గెలిపించడమే ప్రధాన కర్తవ్యమని తీర్మానించారు. టీడీపీ నాయకులు గులిపల్లి సుదర్శనరావు, మర్రాపు పురుషోత్తంనాయుడు, కోట భరత్, పాడి సుదర్శనరావు, జనసేన పార్టీ నాయకులు వారణాశి శివకుమార్, రాజేష్, వెంకీ, ఐటీ కోఆర్డినేటర్ ఎల్.రంజిత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తోయక జగదీశ్వరి

టీడీపీలోకి భారీగా చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

సాలూరు(రూరల్): మండలంలోని తోణాం పంచాయతీ కాలనీ నుంచి 30 కుటుంబాలు (సుమారు 100 మంది) శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీ మండల అధ్యక్షుడు అముదాల పరమేష్ ఆధ్వర్యంలో మువ్వల భాస్కరరావు, మీసాల రాజు, షైదా తవుడు, కొర్రా నాగరాజు, కొర్రా రవి తదితరులు పార్టీలో చేరారు. వీరికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తోణాం పంచాయతీ నాయకులు రొంపల్లి రజనీ, బలివాడ కనక లింగేశ్వరరావు, చైతన్య, మండల నాయకులు మత్స శ్యామ్‌సుందర్, అప్పికొండ యుగంధర్, అక్యాన తిరుపతిరావు, కసినబోయిన వెంకటరమణ, చొక్కాపు వెనుకటి, దొర లక్ష్మణ్, రమన్నదొర, కరిబుగత భాస్కరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **రాజాం:** మండలం బొమ్మినాయుడువలస గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని పంచాయితీల అభివృద్ధికి కేటాయించిన 14, 15 వ ఆర్థిక సంఘం నిధులు జగన్‌రెడ్డి పాలనలో పక్కదారి పట్టాయన్నారు. వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, మంగం రమేష్ దుప్పలపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు బదులు అప్పులు అప్పగించిన జగన్

● టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన ధ్వజం

బొబ్బిలి, మార్చి 1: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకుండా వా రందరినీ అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత ముఖ్యమంత్రి జ గన్‌కు దక్కుతుందని టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన అన్నారు. శుక్రవా రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉగాదికి ఐదు లక్షల చొప్పున ఐదే ళ్లలో 25 లక్షల ఇళ్లను నిర్మించి ఉచితంగా ఇస్తామని మాట ఇచ్చి తప్పిన జగన్ మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. ఇళ్లను నిర్మించుకోకపోతే రద్దు చేస్తామని బెదిరించి, టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి పదివేల కోట్ల రూపాయల అప్పు తెచ్చారన్నారు. రెండేళ్ల కాలపరిమితి మించిపోవడంతో బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు నోటీసులు వస్తున్నాయని, ఇళ్లు అప్ప గించకుండానే ఈ అప్పుల గోల ఏమిటని వారంతా లబోదిబోమంటున్నారన్నారు. ● ఓటీఎస్ పేరుతో ఎన్టీఆర్, చంద్రబాబు ఉచి తంగా ఇచ్చిన ఇళ్లపై లబ్ధిదారుల నుంచి బలవంతంగా పది నుంచి 30 వేల రూ పాయల వరకు వసూలు చేశారని, పేద ప్రజలను దోపిడీ చేశారన్నారు. రాష్ట్ర ప్రజలను జగన్ ఇంకెంత కాలం మోసం చేయలేరని బేబీనాయన అన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

బూర్జ: మండలంలోని నీలంపేట జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరంలోని రామ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న కానిస్టేబుల్ కొత్తూరు సురేష్ (33) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. బూర్జ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల అనంతరం జవాబు పత్రాలను ఆమదాలవలస తరలిస్తున్నారు. ఇందులో భాగంగా పరీక్షా పత్రాలు భద్రపరచడానికి సంబంధిత శాఖాధికారులతో సురేష్ బయలుదేరాడు. నీలంపేట జంక్షన్ వద్ద తన ద్విచక్రవాహనానికి కుక్కలు అడ్డుగా రావడంతో తప్పించే క్రమంలో బోల్తాపడ్డాడు. దీంతో గాయపడిన సురేష్‌ను 108 వాహనంతో శ్రీకాకుళం తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. సురేష్‌కు భార్య శిరీష, తల్లిదండ్రులు ఉన్నారు. సురేష్ మరణంతో బూర్జ స్టేషన్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. తక్కువ కాలంలోనే అందరితో పరిచయం పెంచుకుని సరదాగా ఉండేవాడని సిబ్బంది తెలిపారు.ఈ మేరకు ఎస్‌ఐ జీవీ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

ఎండీఎం నిర్వాహకుల మధ్య వివాదం

జామి, మార్చి 1: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ సీతానగరం ప్రభుత్వ పాఠశాలలో రెండురోజుల క్రితం మధ్యాహ్న భోజనపథక నిర్వాహకుల మధ్య వివాదం రాజుకుంది. వీరిద్దరూ అధికార పార్టీకి చెందిన రెండు వర్గాల మహిళలు కావడంతో విషయం బయటకు రాకుండా ఉంచేందుకు అధికారపార్టీ వారు నానా తంటాలు పడినప్పటికీ వార్త మండలంలో గుప్పుమంది. ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ పాఠశాలలో చాలా ఏళ్లనుంచి ఓ మహిళ పనిచేస్తుంది. ఇదే పాఠశాలలో నాలుగునెలల క్రితం మరో మహిళ వచ్చి చేరింది. అయితే గురువారం మధ్యాహ్నం వంట సమయంలో వీరిద్దరి మధ్య వివాదం తలెత్తడంతో కొట్లాడుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు వారించినా వారు వినలేదు. దీంతో వీరి తగువును తెలియనీయకుండా నాయకులు జాగ్రత్తపడ్డారు. ఇక ఈవిషయంపై మండల విద్యాశాఖాధికారులు మౌనం వహించారు. భర్తతో కలిసి సదరు మహిళ తనను గాయపరిచిందని ఒకరు, తనపై, తనభర్తపై దాడి చేశారని మరొకరు.. ఇలా పరస్పరం మహిళలు ఫిర్యాదులు చేసుకున్నారని ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

మున్సిపల్ స్థలం కబ్జాపై లోకాయుక్తలో కేసు

బొబ్బిలి: మున్సిపల్ పరిధిలోని మల్లమ్మపేట గ్రామంలో సుమారు 12 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వైనంపై లోకాయుక్తలో కేసు నమోదైందని కొప్పల వెలమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల జగన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వే నెంబరు 155/12, 155/14లో మొత్తం 14 సెంట్ల భూమి ప్రభుత్వానిదేనని తహసీల్దారు నిర్ధారిస్తూ మున్సిపాలిటీకి నివేదిక ఇచ్చారన్నారు. దీనిపై అనేక దఫాలు అధికారులకు ఫిర్యాదు చేసిన ప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. దీంతో లోకాయుక్తను ఆశ్రయించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన లోకాయుక్త మున్సిపాలిటీకి నోటీసులు జారీ చేసి నట్లు ఆయన తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: ఆమదాలవలసలో శుక్రవారం చేపట్టిన తనిఖీలో ఒక వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మూడు తులాల బంగారం అపహరణ

గంట్యాడ, మార్చి 1: మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన లెంక వరహాలు మెడలో ఉన్న మూడు తులాల బంగారు తాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. శుక్రవారం మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. లెంక వరహాలు తన భర్తతో కలిసి అన్నయ్యపేటలో జరిగిన శుభ కార్యక్రమానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గొడియాడకు వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు వరహాలు మెడలో ఉన్న మూడు తులాల తాడును అపహరించుకుని పరారయ్యారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బరంపురం వరకు పలాస రైలు

కొత్తవలస: విశాఖపట్టణం నుంచి పలాస వరకు వెళ్లే రైలును బరంపురం వరకు పొడిగిస్తున్నట్టు రైల్వేశాఖ సీనియర్ డీసీఎం ఎ.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఇది అమలులోకి వస్తుందన్నారు. విశాఖలో ప్రతి రోజు సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరి కొత్తవలసకు 6.24కు చేరుతుందని... బరంపురం రాత్రికి చేరుతుందన్నారు. బరంపురంలో తెల్లవారుజామున 3.50 గంటలకు బయలుదేరి ఉదయం 9.20కి విశాఖ చేరుతుందన్నారు.

వాహనాల తనిఖీ



బొబ్బిలి: వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ లోవరాజు

బొబ్బిలి: వాహనదారులంతా విధిగా డ్రైవింగ్ లైసెన్సు, సి.బుక్‌లు కలిగి ఉండాలని ఎస్‌ఐ జి.లోవరాజు అన్నారు. శుక్రవారం స్థానిక రాజా కళాశాల రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఆయన వెంట ట్రాఫిక్ ఏఎస్‌ఐ సన్యాసిరావు, సిబ్బంది ఉన్నారు.

వంగర: ప్రధాన రహదారిలో నిబంధనలు అతిక్రమించి ప్రయాణాలు సాగించే వాహనదారులపై చర్యలు తప్పవని ఎస్‌ఐ జనార్దనరావు హెచ్చరించారు. మడ్డువలస వంతెన సమీపంలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. మైనర్లు నడుపుతున్న వాహనాలు స్వాధీనం చేసుకొని అపరాధ రుసుం విధించారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఉంగరాడమెట్ట కూడలిలో శుక్రవారం సిబ్బందితో కలసి వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సరైన పత్రాలు లేని మొత్తం 20 వాహనాలకు రూ.3,800 అపరాధ రుసుం విధించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

గర్భకోశ వ్యాధులపై అప్రమత్తం

లక్కవరపుకోట: పశువుల్లో తరచుగా వచ్చే గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి కె.గాయత్రి తెలిపారు. శుక్రవారం మార్లాపల్లిలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో సుమారు 60 పశువులను పరీక్షించి.. ఉచితంగా మందులు అందజేశారు.

43,209 మందికి విద్యా దీవెన

కలెక్టరేట్: జిల్లాలోని 43,209 మంది విద్యార్థులకు విద్యా దీవెన నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సీఎం జగన్ కృష్ణా జిల్లా పామర్రులో జరిగిన కార్యక్రమంలో బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 43,209 మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కింద రూ 30.31 కోట్లు జమ అవుతుందని చెప్పారు. అనంతరం విద్యా దీవెన చెక్కులను విద్యార్థుల తల్లులకు అందజేశారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, బీసీ సంక్షేమాధికారి సందీప్, సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్, మైనార్టీ సంక్షేమ అధికారి శామ్యూల్ జాన్, సహాయ బీసీ సంక్షేమ అధికారి యశోధనరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గాయత్రీ దేవి జాతర

రాజాం రూరల్: ఇక్కడి చీపురుపల్లి రోడ్డులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గాయత్రీ వేదమాత 31వ వార్షిక జాతర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు జగదీశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, కొండవేటి వివేకానందరావు తదితరులు పర్యవేక్షించారు.

కమిషనర్ పర్యటన

బొబ్బిలి: వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక కృష్ణాపురం రోడ్డులో గల డంపింగ్ యార్డులో చెత్త స్క్రీనింగ్ పనులను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పరిశీలించారు. రాజానగర్ కాలనీ, అమ్మిగారి కోనేరు గట్టు, ఓంకార్ థియేటర్ వీధి, కంచరవీధిలో ఆమె పర్యటించారు. పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆమె వెంట ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు సోమేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్లు ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛనన్లు పంపిణీ చేస్తునట్లు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయ, వార్డు వలంటీర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పీడీ పర్యవేక్షించారు. జిల్లాలో 2లక్షల 84వేల 718 మందికి వైఎస్‌ఆర్ పింఛను కానుక మంజూరయ్యింది. వీరిలో శుక్రవారం 2 లక్షల 40వేల 161 మందికి పంపిణీ చేశామని చెప్పారు. మొత్తంగా 85 శాతం మందికి పంపిణీ అయినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఐదు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాం రూరల్: పెనుబాక గ్రామ పరిధిలో పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి రాజాం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.10,520 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ మోహనరావు తెలిపారు.

యథేచ్ఛగా మద్యం, గంజాయి రవాణా



మాట్లాడుతున్న భీశెట్టి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలో మద్యం, గంజాయి రవాణా ప్రమాద స్థాయికి చేరిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వస్తే దశల వారీగా మద్య నిషేధం చేసి... ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పారని గుర్తు చేశారు. కానీ మద్యాన్ని రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా చేశారన్నారు. అధిక ధరలకు మద్యం కొనలేని వారు నాటుసారా, కల్తీ మద్యానికి అలవాటు పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత గంజాయికి బానిసలుగా మారి కుటుంబాలను రోడ్డున పడేసే పరిస్థితి తెచ్చారన్నారు. ఇప్పటికైనా అక్రమ మద్యం, గంజాయిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీఎంను కోరారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం



బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న విజయచంద్ర



మేనిఫెస్టోలను అందిస్తున్న జయకృష్ణ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఒక కల్యాణ మండపంలో క్రైస్తవ సంఘం నాయకులు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. ● విజయచంద్ర శుక్రవారం పార్వతీపురం లో సుడిగాలి పర్యటన చేశారు. వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **సీతంపేట:** కొండచొర్లంగి, గులుమూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయకృష్ణ పాల్గొన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ అంశాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, నాయకులు నివర్తి శశి, నిమ్మక చంద్రశేఖర్, సవర మోహన్, సవర సూర్య, సవర రాము, సవర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు బొబ్బిలి వీణ

● బహూకరించనున్న బేబీనాయన



వీణను పరిశీలిస్తున్న బేబీనాయన

బొబ్బిలి: అయోధ్యలోని శ్రీరాముని ఆలయానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన) బొబ్బిలి వీణను కానుకగా ఇవ్వనున్నారు. శుక్రవారం సాయంత్రం గొల్లపల్లి వీణల కేంద్రానికి వెళ్లి కళాకారులతో ఆయన చర్చించారు. బొబ్బిలి వీణ ప్రత్యేకత ప్రస్ఫుటమయ్యే విధంగా ప్రత్యేక ఆకృతిలో రూపొందించాలని వారిని కోరారు. వీణల తయారీ కేంద్రం ఇన్‌చార్జి సర్వసిద్ధి రామకృష్ణతో పాటు ఇతర కళాకారులతో ఆయన మాట్లాడారు. బొబ్బిలి వీణను అయోధ్యలో చూసి ప్రపంచ వ్యాప్తంగా శ్రీరామ భక్తులంతా పులకించిపోవాలని బేబీనాయన అన్నారు. నాయకులు కాకల వెంకటరావు, బొబ్బాది తవిటినాయుడు, పిరిడి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

దళారుల దెబ్బకు టమోటా రైతు కుదేలు



కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న టమోటా రైతులు

జామి: మీరు చూస్తున్న ఈ మార్కెట్ జామి మండల కేంద్రంలోనిది. శుక్రవారం ఉదయం టమోటా రైతులు తమ పంటను అమ్ముకోవడానికి మార్కెట్‌కు వచ్చారు. ముందురోజు ఒక మోస్తరు ధరకు అమ్మ కున్న రైతులు అదే ధరకు శుక్రవారం కూడా అమ్ముకోవచ్చనుకున్నారు. కానీ వారిని దళారులు మోసం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి టమోటా కొనడా నికి వచ్చిన దళారులు ఒక ట్రే రూ.300కు మించి కొనలేమని తేల్చి చెప్పారు. దీంతో రైతులు అవాక్కయ్యారు. గురువారం ట్రే టమాటా రూ.350 నుంచి 450 వరకు పలికింది. ఒకే రోజులో ధర రూ.100 నుంచి రూ.150కి తగ్గడంతో రైతు లు అవాక్కయ్యారు. గురువారం నాటి ధరైనా ఇవ్వాలని కోరినా దళారులు కనికరించలేదు. వారంతా సిండికేట్ కావడంతో చేసేదిలేక అడిగిన ధరకు అప్పగించి రైతులు ఉసూరుమంటూ ఇంటి దారి పట్టారు.

జేఎన్‌టీయూలో క్రిసెన్స్-2కె 24



కళాశాల వీసీ వెంకటసుబ్బయ్య, నేరెళ్ల నరేంద్రని సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో క్రిసెన్స్-2కె 24 జాతీయ స్థాయి సదస్సును శుక్రవారం వీసీ వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులతో సాంకేతిక అంశాలను తెలుసుకోవడంతో పాటు, నిత్య నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. ప్రత్యేక అతిథిగా ఇన్‌స్పైర్ ఎడ్జ్ ఐటీ సొల్యూషన్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నేరేళ్ల నరేంద్ర హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ జెనరేటివ్ ఏఐ, డ్రోన్ టెక్నాలజీ తదితర వాటిని వివరించారు. కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజనీరింగు వార్షిక పత్రిక 'జైర్-2024'ని ఆవిష్కరించారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రామలక్ష్మి

బొబ్బిలి: ఆస్తిపన్నుపై వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబరు 35ను విడుదల చేసినందున పట్టణ ప్రజలంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని అసెస్‌మెంట్ల నుంచి ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నులు, కుళాయిల పన్నుల లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ సాధించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌ఓ ప్రసాదరావు, ఆర్‌ఐ త్రినాథ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



సమీక్ష చేస్తున్న ప్రేమ్ కుమార్

కొత్తవలస: ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.ప్రేమ్ కుమార్ సూచించారు. శుక్రవారం కొత్తవలస జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. టోఫెల్ విద్యాబోధనపై సమీక్ష నిర్వహించారు. 10 వతరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఆరా తీశారు. సమావేశంలో ఎంఈఓ బండారు శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఈశ్వరరావు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

విజయనగరం రింగురోడ్డు: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3న (ఆదివారం) పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు చెప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలు అందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని అన్నారు. పోలియో వ్యాధిని రూపుమాపేందుకు చుక్కలు వేయించడమే ఏకైక మార్గమన్నారు. జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు సుమారు 1 లక్ష 98 వేల 478 మంది ఉన్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పోలియో చుక్కలు వేయడానికి 1,182 బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 5 వేల మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో విధులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు వైద్యాధికారి డాక్టర్ రాణి, జిల్లా టీకా అధికారి అచ్యుత కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం: పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.దిలీప్ కుమార్ కోరారు. 12 బూతుల్లో 1 నుంచి 5 సంవత్సరాల లోపు 2,589 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామని తెలిపారు. 5న ఇంటింటికి వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు.

● **విజయనగరం రూరల్:** ఈ నెల 3న జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించి రాకోడు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం అధికారి ఎన్.శ్రావణి, బండారు అఖిల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది మాణిక్యం, రాముడమ్మ, శ్రీరామమూర్తి, శ్రీనివాస్, కళావతి, చిన్నారావు, కృష్ణా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: ఈనెల 3నుంచి 5వ తేదీ వరకు జరగనున్న పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెంటాడ వైద్యాధికారిణి లోకప్రియ కోరారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీ వద్ద శుక్రవారం పోస్టర్ విడుదల చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలన్నారు. శిబిరాల వద్దకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సూచించారు.



విజయనగరంలో ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో



మెంటాడ: పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యులు